జిల్లాలో తగ్గిన నేరశాతం

- 11,965 ఫిర్యాదులు, 7,123కేసుల నమోదు
- అసెంబ్లీ ఎన్నికలను విజయవంతం చేశాం
- వార్షిక నివేదిక వెల్లడించిన ఎస్పీ రాహుల్ హెగ్డే

వార్షిక నివేదికను వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, డిసెంబర్ 25 : జిల్లా పోలీసులు ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలిగి పారదర్శకంగా పని చేయడంతో కేసుల సంఖ్య, నేరాల శాతం తగ్గిందని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 2023 జిల్లా పోలీస్ వార్షిక నివేదిక వివరించారు. జిల్లా వ్యాప్తంగా 2023లో 11,965 ఫిర్యాదులు రాగా 7,123కేసులు నమోదు చేయగా మిగిలిన వాటిపై విచారణ చేసి తొలగించామన్నారు. 33,026 డయల్ 100 ఫిర్యాదులపై స్పందించి బాధితులకు సేవలు అందించామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా సరిహద్దులో 14 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రూ.3.43కోట్ల నగదు, 50లక్షల విలువైన గంజాయి, 23లక్షల విలువైన 4,373లీటర్ల మద్యం, రూ.1.29కోట్ల విలువైన అభరణాలు, రూ.1.11కోట్ల విలువైన పరికరాలు, దుస్తులు సీజ్ చేశామని తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించినందుకు 61 కేసులు నమోదు చేశామన్నారు. 155 లైసెన్స్ ఆయుధాలు డిపాజిట్ చేయడంతో పాటు నేరాలకు పాల్పడే అవకాశమున్న 3,956మందిని ముందస్తుగా అదుపులోకి తీసుకుని బైండోవర్ చేయడం, 560 నాన్ బెయిలబుల్ వారెంట్స్ ఎగ్జిక్యూట్ చేశామన్నారు. ప్రజా వాణిలో 2023లో 306 ఫిర్యాదులు తీసుకొని అన్ని ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నామన్నారు. 2022లో 26హత్య కేసులు నమోదు కాగా 2023లో 22హత్య కేసులు నమోదయ్యాయన్నారు. 2022లో 421 దొంగతనాలు జరగ్గా 2023లో 352 జరిగినట్లు తెలిపారు. ఈ సంవత్సరంలో 225 కేసులు డిటెక్ట్ చేశామని 16శాతం దొంగతనాలు తగ్గాయన్నారు. తీవ్రమైన దొంగతనాలు 47శాతం తగ్గినట్లు తెలిపారు. ఈ ఏడాది దొంగతనానికి గురైన రూ.3.63కోట్ల సొత్తులో 54శాతం రూ.1.95కోట్లు రికవరీ చేశామన్నారు. 2022లో 71 అత్యాచార కేసులు నమోదవగా 2023లో 56 నమోదై 21శాతం తగ్గిందన్నారు. బాలలపై జరిగిన నేరాలకు పోక్స్ చట్టం ప్రకారం 2022లో 122కేసులు నమోదవగా 2023లో 93కేసులు నమోదయ్యాయన్నారు. మహిళా సంబంధిత నేరాలు 2023లో 696 కేసులు నమోదవగా ఇందులో వేధింపులకు సంబంధించి 307, అత్యాచారం 55, మిస్సింగ్ 34కేసులు ఉన్నాయని తెలిపారు. మిస్సింగ్‌కు సంబంధించి జిల్లాలో 380కేసులు నమోదవగా 343 కేసులు ట్రాప్ చేశామన్నారు. జిల్లాలో వైట్ కాలర్, వ్యవస్థీకృతమైన నేరాలు అదుపు చేశామన్నారు. తీవ్రమైన నేరాలు 2023లో 59కేసులు నమోదవగా, ఎస్సీ, ఎస్సీకి సంబంధించి 2022లో 90, 2023లో 62 కేసులు నమోదు చేశామన్నారు.

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి 68కేసులు నమోదు కాగా 1020 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేసి 110మందిని అరెస్ట్ చేశామన్నారు. జూదం ఆటలో 34కేసులు నమోదు చేసి 229మందిని అరెస్టు చేశామన్నారు. బహిరంగంగా మద్యం సేవించడంపై 7,331 కేసులు నమోదు చేసి 5,175మందిపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. బైండోవర్ చట్టాన్ని ఉల్లంఘించే అవకాశం ఉన్నందున 960 కేసులు నమోదు చేసి 4,221మందిని ముందస్తుగా బైండోవర్ చేశామన్నారు. ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కన్‌లో భాగంగా సబ్ డివిజన్‌ల వారీగా టీమ్స్ ఏర్పాటు చేసి 2023లో 161మంది బాలికలను గుర్తించి సంరక్షకులకు అప్పగించామన్నారు. సీసీటీవీలు, ప్రజల సహకారంతో కమ్యూనిటీ పోలిసింగ్ కార్యక్రమంలో భాగంగా 2023లో 1392 నూతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేవామని రిపేర్‌లో ఉన్న కెమెరాలను పునరుద్ధరించామని తెలిపారు. సైబర్ నేరాలకు సంబంధించి జిల్లా కార్యాలయం నుంచి సైబర్ సెక్యూరిటీ సెల్ ఏర్పాటు చేసి 1,112 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని 770 ఫిర్యాదుల్లో రూ.4.7కోట్లు సైబర్ మోసగాళ్లు దొంగిలించినట్లు గుర్తించామన్నారు. షీటీమ్స్ ఆధ్వర్యంలో 203 అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా 126 ఫిర్యాదులు స్వీకరించి ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు పరిష్కారానికి కృషి చేశామన్నారు. ట్రైనింగ్, పనిలో సామర్థ్యం సిబ్బంది ప్రతి ఒక్కరిలో పారదర్శక సామర్థ్యం, నైపుణ్యం పెంపునకు ఆన్‌లైన్, ఆఫ్ లైన్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని పనిలో ప్రతిభ కనభర్చిన వారికి 558 రివార్డ్స్ అందించామన్నారు. పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుపేద యువత 450మందికి 10నెలల పాటు అవుట్‌డోర్, ఇండోర్ తరగతులపై ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు భోజనం, వసతి యువతీ యువకులకు వేర్వేరుగా కల్పించి ఉచితంగా స్టడీ మెటీరియల్స్‌ను అందించామని తెలిపారు.

గంజాయి అక్రమ రవాణాపై..

2023లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న 56మందిపై 23కేసులు నమోదు చేసి 605కిలోల గంజాయి సీజ్ చేశామని ఒకరిపై పీడీ యాక్టు నమోదు చేశామన్నారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి 2023లో 176 కేసులు నమోదు చేసి 214 వాహనాలు సీజ్ చేసి 226మందిని అరెస్టు చేశామన్నారు.

తగ్గిన రోడ్డు ప్రమాద మరణాలు..

2022లో 502 రోడ్డు ప్రమాదాల్లో 252మంది మరణించగా 490మందికి గాయాలయ్యాయని, 2023లో 514 ప్రమాదాలు కాగా 231మంది మరణించగా 471మందికి గాయాలైనట్లు తెలిపారు. రోడ్డు భద్రత చర్యలు, వాహనాల తనిఖీలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏర్పాటుతో రోడ్డు ప్రమాదాలు 8.3శాతం తగ్గి మరణాలు తగ్గాయన్నారు. పెటీ కేసులు 2022లో 13,726 నమోదవగా, 2023లో 15,968కేసులు నమోదయ్యాయని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో 21,860 కేసులు నమోదు చేసి 10,403 కేసుల్లో జరిమానాలు కట్టించామన్నారు. మోటార్ ట్రాన్స్‌పోర్టు, రోడ్డు భద్రతా నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి 2,70,075 కేసులు నమోదు చేసి రూ.7.40కోట్ల జరిమానా విధించినట్లు తెలిపారు. 55కేసుల్లో 79మంది నేరస్తులకు జైలు శిక్షలు పడ్డాయని వీరిలో ఆరుగురు నేరస్తులకు జీవిత ఖైదు, బాలలపై లైంగిక నేరాలకు పాల్పడ్డ ముగ్గురికి 20సంవత్సరాల జైలుశిక్ష పడిందని తెలిపారు. వివిధ కేసుల్లో 12మందికి పదేండ్ల జైలుశిక్ష, 15మందికి ఐదేండ్ల జైలుశిక్ష పడినట్లు తెలిపారు.

నేడు మండల పూజ మహోత్సవం

కోదాడ రూరల్, డిసెంబర్ 25 : పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం మహా మండల పూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5గంటలకు మహా గణపతి హోమం, 6 గంటలకు రుద్రాభిషేకం, 7గంటలకు స్వామి వారికి స్వర్ణ పుష్పాలతో అర్చన, 8గంటలకు నవకలశ పూజ, 9.30గంటలకు అలంకరణ, 10గంటలకు సహస్రనామ పుష్పార్చన, 12.15గంటలకు పడిపూజ, 12.30గంటలకు భక్తులకు అన్నదానం, సాయంత్రం 4.30గంటలకు స్వామి అలంకార దర్శనం, 5.30గంటలకు అగ్నిగుండ ప్రవేశం, రథోత్సవం, రాత్రి 9గంటలకు పూజ, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోదాడ పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు, మాలధారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అన్నదానాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు వెంకటనారాయణ

అన్నదానం అభినందనీయం

కోదాడ రూరల్, డిసెంబర్ 25 : మాలధారులకు నిత్య అన్నదానం అభినందనీయమని బీఆర్ఎస్ నాయకుడు వెంకటనారాయణ అన్నారు. సోమవారం ఆయన తన మనవడు నాగుమా యశ్వన్ పుట్టినరోజు సందర్భంగా మాలధారులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ధర్మపత్ని స్వరాజ్యంతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. అంతకుముందు సన్నిదానంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, ఓరుగంటి కిట్టు, కంచుకొమ్ముల సైదులు, శంకర్, సీతారాంసింగ్, రంగారావు, మాలధారులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

బొడ్రాయిబజార్, డిసెంబర్ 25 : సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పట్టణ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణులు, కర్షకులు, విద్యార్థి సంఘాలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, దోరెపల్లి శంకర్, చామల అశోక్‌కుమార్, నిమ్మల ప్రభాకర్, ఖమ్మంపాటి రాము పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి

బొడ్రాయిబజార్, డిసెంబర్ 25 : ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు జిల్లా కేంద్రంలోని వార్డుల్లో జరిగే ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి, జడ్పీ సీఈఓ సురేశ్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులు, అంగన్‌వాడీ, మెప్మా, రెవెన్యూ, ఎలక్ట్రికల్, పోలీసుశాఖతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలోని 48వార్డుల్లో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. దరకాస్తులను నింపి ఎనిమిది రోజుల్లో ఏదో ఒక రోజు వార్డులో జరిగే సభల్లో అందించి రశీదు పొందాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సంబంధిత దరకాస్తును ఆన్‌లైన్‌లో పొందుపర్చడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో తాసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, సీఐ రాజశేఖర్, రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఏడీఈ శ్రీనివాస్, మున్సిపల్ ఈఈ ప్రసాద్, మెప్మా పీడీ రమేశ్‌నాయక్, డీఈ సత్యారావు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న తిరుపతి స్వామి నాట్య బృందం

నాట్య బృందానికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు

కోదాడ టౌన్, డిసెంబర్ 25 : పట్టణానికి చెందిన నాట్య గురువు తిరుపతి స్వామి నాట్య బృందానికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు లభించింది. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ, భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన లార్జెస్ట్ కూచిపూడి డ్యాన్స్ లెసన్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అచీవ్‌మెంట్ కార్యక్రమంలో వారికి బహుమతులు అందించారు. కూచిపూడి నృత్యంలో తమ బృందం కనబరిచిన ప్రతిభకు గాను ఈ అవార్డు లభించింది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సీఈఓ రిషికేష్, తెలంగాణ ఆర్ట్ అండ్ కల్చర్ మినిస్టర్ జూపల్లి కృష్ణారావు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ మినిస్టర్ సీతక్క నుంచి అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నట్లు నాట్య గురువు తిరిపతి స్వామి తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు గుడిపూడి శ్రీధర్ రేవతి, కిరణ్మయి, శైలజ, లక్ష్మి, నారాయణ, శిరీష, రమేశ్, మమత, రాంబాబు, సుహాసిని, శైలజ, స్రవంతి పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

నేరేడుచర్ల, డిసెంబర్ 25 : నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో పలువురు పేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎంపీజీఎఫ్‌లైన్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ జెల్ల దశరథ సహకారంతో పేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

నిరుపేద కుటుంబానికి సాయం

గరిడేపల్లి, డిసెంబర్ 25 : మండలంలోని కోదండరామాపురం గ్రామానికి చెందిన నిరుపేద ఆకారపు లింగయ్య పక్షవాతంతో బాధపడుతుండగా నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర సరుకులు, బియ్యం అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ వెన్న రవీందర్‌రెడ్డి, క్లబ్ కార్యదర్శి జిలకర రామస్వామి, జోన్ చైర్మన్ యడవెల్లి సత్యనారాయణరెడ్డి, సభ్యులు రంగారెడ్డి, లక్ష్మారెడ్డి, బిక్షం, సైదులు, శ్రీను పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి తోమాల సేవ

మేళ్లచెర్వు, డిసెంబర్ 25 : మండలవ్యాప్తంగా వైష్ణవాలయాల్లో ధనుర్మాసోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు సహస్రనామ పారాయణం, అభిషేకాలు, కుంకుమార్చన పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. వేడుకల్లో భాగంగా స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేక పూజల అనంతరం తోమాల సేవను నిర్వహించారు. అర్చకులు సుదర్శనం ప్రసాదాచార్యులు, మోహనకృష్ణ, భానుకిరణ్‌శర్మ, వరప్రసాదాచార్యులు, శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

నృసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి, డిసెంబర్ 25 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో నిత్య కల్యాణాన్ని అర్చకులు సోమవారం శాస్త్రోక్తంగా జరిపించారు. ముందుగా స్వామి, అమ్మవార్లను పంచామృతాలతో అభిషేకించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, ఈఓ నవీన్ పాల్గొన్నారు.

అర్హులందరికీ బీమా.. బ్యాంక్ అకౌంట్

(5వ పేజీ తరువాయి)

ఆయుష్మాన్ భారత్, పీఎం పోషణ్ అభియాన్ తదితర పథకాలపై ప్రజలకు అవగాహన ఉండాల్సి ఉంది. ఇందుకుగానూ కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా బ్యాంకుల భాగస్వామ్యంతో మేధావులతో ప్రచారం నిర్వహిస్తున్నది.

జిల్లా వ్యాప్తంగా ప్రచారం..

జిల్లాలోని 475 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 16న ప్రత్యేక వాహనాలతో ప్రచారాలు ప్రారంభమయ్యాయి. మొత్తం ఆరు ప్రచార వాహనాలు ఏర్పాటు చేయగా ఒక్కో వాహనంతో ఆయా ప్రాంతాల బ్యాంకులకు చెందిన ఇద్దరు ఉద్యోగుల చొప్పున ఆరు వాహనాల వెంట మొత్తం 12 మంది ఉంటున్నారు. ఉదయం 12, సాయంత్రం 12 గ్రామాల చొప్పున రోజుకు 24 గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. అయితే చిన్న పంచాయతీలు ఉన్నచోట రోజుకు 30 నుంచి 35 గ్రామాలు పూర్తి చేస్తున్నారు. గ్రామాల్లో సెంటర్ వద్ద వాహనాలు నిలిపి బ్యాంక్ అధికారులతో పాటు మేధావులు, ఇతర ఉద్యోగులతోపాటు గ్రామస్తులను ఆహ్వానించి వారికి సంక్షేమ పథకాలపై వివరిస్తున్నారు. గ్రామాల్లోనే అక్కౌంట్లు లేని వారిని గుర్తించి అక్కౌంట్లు ఇప్పించడం, వారికి బీమా విలువలు తెలియజేస్తూ బీమా కల్పించడం, అర్హులైన కుటుంబాలకు ఉజ్వల గ్యాస్‌తోపాటు ఇతర అన్ని సంక్షేమ పథకాలను కల్పిస్తున్నారు. ఇప్పటికే దాదాపు 70 శాతం గ్రామాలు పూర్తి కాగా రేపటితో అధికారికంగా గడువు ముగియనుందని, అవసరమైతే మరో రెండు రోజులు కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో ప్రత్యేక వాహనాల ద్వారా ప్రచారం చేస్తున్నాం. ప్రజలు సద్వినియోగం చేసుకుంటూ సంక్షేమ పథకాలు పొందాలి. వాహనాలు తిరిగే సమయంలోనే కాకుండా మామూలుగా ఆయా ప్రాంతాల్లోని బ్యాంకులను సంప్రదించి సంక్షేమ పథకాల వివరాలు తెలుసుకోవచ్చు. ఇప్పటి వరకు జిల్లాలో 70 శాతం పంచాయతీల్లో ప్రచారాలు పూర్తయ్యాయి. రేపటితో గడువు ముగుస్తుండగా దాదాపు వంద శాతం గ్రామాలు పూర్తవుతాయి. ఒకవేళ మరికొన్ని గ్రామాలు మిగిలి ఉంటే రెండు, మూడ్రోజులు పొడిగిస్తాం.

–సీహెచ్ బాపూజీ, లీడ్ బ్యాంక్ మేనేజర్

ఆటో దగ్ధం

భువనగిరి అర్బన్, డిసెంబర్ 25 : గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుటించడంతో ఆటో దగ్ధమైన ఘటన మండలంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాజ్‌పూర్‌కు చెందిన బొమ్మారపు రామకృష్ణ ఆటోను నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఆటోను ఇంటివద్దనే ఉంచాడు. సోమవారం 12.45 గంటలకు శబ్దం రావడంతో రామకృష్ణ తల్లి పద్మ లేచిచూడగా ఆటో కాలిపోతుంది. విషయాన్ని రామకృష్ణకు తెలుపగా మంటలకు ఆర్పాడు. అప్పటికే ఆటో పైభాగం పూర్తిగా కాలిపోయింది. బాధితుడు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

గంజాయి స్వాధీనం

యాదగిరిగుట్ట, డిసెంబర్ 25 : గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని యాదగిరిగుట్ట పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పాతగుట్ట చౌరస్తా వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా పప్పు కుమార్ బల్మికి బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు ఆపారు. 129 గ్రాముల గంజాయి పట్టుబడింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట, డిసెంబర్ 25 : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వంగపల్లికి చెందిన జోగు చంద్రయ్య(45) శనివారం సాయంత్రం వ్యవసాయ క్షేత్రానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా హైదరాబాద్‌కు చెందిన కారులో ఢీకొట్టింది. చంద్రయ్యకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేశ్ తెలిపారు.

కోదాడకు చేరుకున్న అయోధ్య అక్షింతలు

అయోధ్య అక్షింతలను పట్టణంలో ఊరేగిస్తున్న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యులు

కోదాడ టౌన్, డిసెంబర్ 25 : అయోధ్యలో జనవరి 22న నిర్వహించే రామ మందిర ప్రారంభోత్సవం, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి పూజించిన అక్షింతలు కోదాడ చేరుకోగా స్థానికులు ఘన స్వాగతం పలికారు. ట్రస్టు నిర్వాహకులు కోదాడ నియోజకవర్గంలోని గ్రామాల్లో గల ఆలయాలకు అక్షింతలు పంపారు. అంతకుముందు కోదాడలోని కాశీనాథం ఫంక్షన్ హాల్ నుండి రామాలయం వరకు భక్తులు ఊరేగింపుగా అక్షింతలు ఉన్న కలశాలను తలపై పెట్టుకుని శ్రీరామ నామస్మరణతో పట్టణంలో ఊరేగించారు. కార్యక్రమంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు కోదాడ అసెంబ్లీ కన్వీనర్ దండాల సీతారాంరెడ్డి, శ్రీధర్, సైదేశ్వర్‌రావు, కిట్టు పాల్గొన్నారు.

మోతె : అయోధ్య నుంచి వచ్చిన రాములోరి అక్షింతలను మండల కేంద్రంలోని రామాలయానికి సోమవారం భారీ ఊరేగింపుతో తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ కావేటి భాగ్య, సర్పంచ్ మెట్టు అలివేలూనారాయణరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్ : అయోధ్య అక్షింతలు మండలంలోని గుడిబండ గ్రామ రామాలయానికి సోమవారం చేరాయి. కోదాడ పట్టణ కాశీనాథం ఫంక్షన్ హాల్ నుంచి గుడిబండకు రామభక్తులు అక్షింతలను పాదయాత్రగా తీసుకొచ్చారు. పాదయాత్రకు గ్రామ పెద్దలు, భక్తులు హారతులతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భక్త బృందం, సర్పంచ్ అలివేలు మంగమ్మ, ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి, పి.వెంకటేశ్వర్‌రెడ్డి, యరగాని లక్ష్మయ్య, రాధాకృష్ణ, ఓరుగంటి రామకృష్ణారెడ్డి, వాచేపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



సూర్యాపేటలోని న్యూలైఫ్ మినిస్ట్రీస్ చర్చిలో పండ్లు పంపిణీ చేస్తున్న పాస్టర్ శాంసన్

సూర్యాపేటలోని సిలోయం చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

ఘనంగా క్రిస్మస్

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు..
- క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు

సూర్యాపేట జిల్లాలోని ఆయా చర్చిల్లో క్రైస్తవులు సోమవారం క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని సెంటినరీ బాప్టిస్టు చర్చిలో ఫాస్టర్ ఎం.ప్రభుదాస్, సిల్వి సిలోయం చర్చిలో ఫాస్టర్ సిల్వి, బేతస్థ మినిస్ట్రిస్‌లో బిషప్ దుర్గం ప్రభాకర్, న్యూలైఫ్ మినిస్ట్రీస్‌లో ఫాస్టర్ మామిడి శాంసన్, నిర్మల మాత చర్చిలో ఫాస్టర్ పసల మరియన్న, సీఎస్ఐ సెయింట్ పీటర్ చర్చిలో ఫాస్టర్ బి.జవహర్‌బాబు, డబ్ల్యూఎంఈ చర్చిలో ఫాస్టర్ జాన్‌మార్క్ క్రీస్తు సందేశాన్ని వినిపించారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని మండలాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సూర్యాపేటలోని విశ్వాస్ చర్చిలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న హరిప్రసాద్

సూర్యాపేట రూరల్ : సోలిపేటలో జరిగిన క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న ఎంపీపీ రవీందర్‌రెడ్డి

చివ్వెంల : కాసింపేటలో పేదలకు దుస్తులు అందజేస్తున్న పాస్టర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు దుర్గం ప్రభాకర్

కోదాడ టౌన్ : కోదాడలోని బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

FLAT FOR SALE
★HAYATHNAGAR: Walkable Distance, Vijayawada Highway, Beside Bus Stop, Sup. Luxurious 3 BHK Flats, Ready to move, 2 side 30' Rd. Ph: 9247326642 / 9849801477.
NT-314488

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

నల్లగొండ: 9182777626	నల్లగొండ: 9182777635	దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059	సూర్యాపేట: 9182777630	భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059	కోదాడ: 9182777196	తొలుపునూరి: 9182777638